# తుంటరి భూతాలు



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నోసార్లు భయంకర రూపాలు ప్రజలకు కనిపించాయి. ఇవి ఏర్పడటానికి గల కారణాన్ని ఏ సైన్సూ ఇంతవరకు రుజువు చెయ్యలేకపోయింది. అటువంటి సందర్భాలలో ఈ వికృతరూపాల వెనుక ఘోస్ట్స్ ఉన్నాయని ప్రజలు నమ్మక తప్పటంలేదు.

అది, 1971వ సంవత్సరం ఆగస్టు నెలలో ఒక మిట్ట మధ్యాహ్నం...

స్పెయిన్‌లోని బెల్మెజ్ గ్రామం...

ఈ గ్రామం 'అండాలుసియా' ప్రావిన్సులోని 'కార్డోబా' ప్రాంతానికి చెందినది.

ఆ రోజు సూర్యుడు నిప్పులు చెరుగుతుండటంతో వాతావరణం వేడిగా ఉంది. బెల్మెజ్ గ్రామంలోని ఒక రైతు ఇంట్లో ఒక వృద్ధ వనిత వంట వేస్తున్నది. ఆమె పేరు ఫిలోమెనా.

ఆమె మనవలు, మనవరాళ్ళు కిచెన్ ఫ్లోర్ మీద ఆడుకుంటున్నారు. వాళ్ళ కేరింతలతో ఇల్లు మార్మోగిపోతున్నది. ఫిలోమెనా వంట పనిలో తీవ్రంగా నిమగ్నమైపోయింది.

హఠాత్తుగా కెవ్వుమన్న కేకలు, ఏడుపులు ఒక్కసారిగా ఆ ఇంట్లోంచి వెలువడ్డాయి. దాంతో ఫిలోమెనా గాభరాగా పిల్లలను సమీపించింది.

"ఎందుకర్రా అలా గొడవ చేస్తారు? రాను రాను మీ అల్లరి శృతిమించుతున్నది..." ఆవేశంగా పిల్లలను మందలించింది.

కాని పిల్లలు ఆమె మాటలు ఆలకించే స్థితిలో లేరు. గజగజ వణికిపోతూ, గోడను అంటిపెట్టుకొని నేల చూపులు చూస్తున్నారు. పిల్లలు తన మాటలు పట్టించుకోలేదని ఫిలోమెనాకు మరింత కోపం వచ్చింది.

"ఎందుకలా గుడ్లు మిటకరించి చూస్తారు?" కోపంగా గద్దించింది.

"గ్రాండ్ మా!... అటు చూడు"... భయంతో వణికిపోతూ ఒక పిల్లవాడు ఫ్లోర్ వంక చూపించాడు.

ఫిలోమెనా ఫ్లోర వంక పరీక్షగా చూసింది భయంతో ఆమెకు రక్తం గడ్డకట్టినట్లనిపించింది. అయితే తను కూడా భయపడితే పిల్లలు మరింత బెంబేలెత్తిపోతారని ధైర్యాన్ని కూడగట్టుకున్నది. పింక్ కలర్‌లో ఉన్న కిచెవ్ ఫ్లోర్ మీద భయంకరమైన కొన్ని రూపాలు వాటంతటవే ఏర్పడుతున్నాయి.

పిల్లల భయాన్ని పోగొట్టటానికి ఫిలోమెనా ఒక డస్టర్ తెచ్చి దాంతో ఫ్లోర్‌ను శుభ్రంగా

మేకపాటి హనుమంతరాయుడు

తుడిచింది. కాని ఆ రూపాలు చెరిగిపోలేదు. అంతే కాకుండా అవి కళ్ళు పెద్దవి చేసి చిరునవ్వులు చిందించటం మొదలు పెట్టాయి. కొద్ది నిముషాల్లోనే ఆ ఇంట్లో వాళ్ళంతా ఇల్లు వదిలి పారిపొయ్యారు. ఈ వార్త దావానలంలా ఊరంతా వ్యాపించింది. పౌర అధికారులు, పోలీసులు ఈ విచిత్ర సంఘటనపట్ల దర్యాప్తు మొదలు పెట్టారు.


కాని వాళ్ళు ఏ నిర్ధారణకు రాలేకపొయ్యారు. చివరకు వాళ్ళు కిచెన్‌లోని ఫ్లోర్‌ను పూర్తిగా తవ్వేసి, కొత్త ఫ్లోర్ వెయ్యవలసిందిగా ఇంటి యజమానిని ఆదేశించారు. దాంతో మొత్తం ఫ్లోర్‌ను తవ్వేసి, తరువాత బాగా కాంక్రీట్ వేసి దానిపైన కొత్త ఫ్లోర్‌ను ఏర్పాటు చేసారు.

కొద్ది రోజులు గడిచాయి...

మరల కొత్త కొత్త రూపాలు ఒకదాని వెంట ఒకటిగా కిచెన్ ఫ్లోర్ మీద ప్రత్యక్షమయ్యాయి. అధికారులకు మళ్ళా కబురు వెళ్ళింది. ఈ సారి వాళ్ళు మొత్తం ఇంటి ఫ్లోర్ నంతటిని తవ్వమని ఆజ్ఞాపించారు. రెండవ ప్రయత్నంలో నేలను బాగా లోతుకు తవ్వేసరికి లోపల ఎన్నో సమాధులు బయటపడ్డాయి. ఆ ప్రదేశమంతా మధ్యయుగాలకు చెందిన మరుభూమిగా పరిశోధనల్లో తేలింది. తరువాత ఇల్లంతా మళ్ళీ కొత్త ఫ్లోర్ వెయ్యబడింది. అందరి ఆశలను నీరుగారుస్తూ కొద్ది రోజుల్లోనే వికృతరూపాలు ఫ్లోర్ మీద మళ్ళీ కనిపించసాగాయి. ఈ పర్యాయం వాటిల్లో స్త్రీ పురుషరూపాలు కూడ కనిపించాయి. అధికారులు ఇంటిని సీలువేసి తమ పరిశోధనలను తీవ్రం చేసారు. ఎంతో సూక్ష్మమైన శబ్దాలను కూడా రికార్డు చెయ్యగల సున్నితమైన పరికరా లను ఆ ప్రదేశమంతటా ఏర్పాటు చేసారు. కొద్ది రోజుల తరువాత రికార్డెడ్ టేప్స్‌ను పరిశీలించగా, అర్థంకాని భాషలో సంభాషణలు, రకరకాల గొంతులు, మూలుగులు వినిపించాయి. చివరకు ఆ గ్రామస్తులంతా చనిపోయినవారి ఆత్మశాంతికి ప్రార్థనలు జరిపించారు. దాని తరువాత వికృతరూపాలు కనిపించటం క్రమంగా ఆగిపోయింది. ✻

**GHOST STORY**

# జగమంత వింతల మయం





## 'బ్రా'ను దొంగిలించే మాయగాడు

మాయలు, మంత్రాలతో వేసే విచిత్రాలు చాలా ఆశ్చర్యంగానూ, నమ్మలేనట్లుగానూ వుంటాయి. అవి ఎలా సాధ్యమో చెప్పటం మామూలు మనుషులకు అంతు చిక్కదు. ఆస్ట్రేలియా దేశస్థుడైన 'ఫిల్‌కాస్' అనే మాయగాడు ఒక వింతైన మేజిక్‌ను వేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అతను, ప్రేక్షకులలోంచి మనం చెప్పిన స్త్రీని స్టేజి మీదకు పిల్చి, ఆమెను కొంచెం కూడా తాకకుండా, దూరంగా ఉండి, తన ప్రతిభతో ఆమె జాకెట్టులోనున్న 'బ్రా'ను మాయం చేస్తున్నాడు. ఆమె చూసుకొని ఆశ్చర్యపడి, సిగ్గుపడే లోపుగా, ఆ 'బ్రా'ను తన జేబులోంచి తీసి ఆమెకిస్తున్నాడట. వారేవా! ఆనాటి చీరల దొంగనే మించిపోయాడు కదూ!


## కుక్కల 'కోలా'

మనుషుల దాహం తీర్చేటందుకు థమ్స్ అప్, కోకాకోలా, గోల్డ్‌స్పాట్ లాంటి కూల్ డ్రింక్స్ ఎలాగయితే వున్నాయో, కుక్కల దాహం తీర్చే కూల్ డ్రింక్స్ కూడా వున్నాయంటే నమ్ముతారా! నిజం మరి. అమెరికాలోని కుక్కలు ఆనందంగా సేవించే కూల్ డ్రింక్స్ వున్నాయి. వాటిని చూస్తే చాలు కుక్కలు ఆనందంతో ఎగిరి గంతేస్తుంటాయి. ఆ కూల్ డ్రింక్స్ 'మాంసం' రుచిలో వుండటమే కుక్కలకు ఆకర్షణ. ఆ డ్రింక్స్ పేరు 'కాక్ డాగ్''





## మాట్లాడే బూట్లు

''కాళ్ళకు తొడుక్కొన్న బూట్లు ''టక్ టక్'' మంటూ శబ్దం చెయ్యటం నిజమే కానీ, మరి మాట్లాడటం ఏంటి!''అంటారా! 'కంప్యూటరైజ్‌డ్' బూట్లు ఆ కాలక్షేపాన్ని కూడా ఇస్తున్నాయి. ఆ బూట్లను తొడుక్కొని వెళ్తూ, ఎంత దూరం వచ్చాము. ఎంత వేగంతో పరుగు తీస్తున్నాము. నా బరువెంత లాంటి ప్రశ్నలకు చకచకా సమాధానాలు చెప్తూ, పరుగు తీస్తున్న మనిషికి అలసట తెలియకుండా కంపెనీ ఇస్తున్నాయట.




## రికార్డు స్థాయిలో ''కప్ప''

ఎన్నెన్నో రకాల ప్రక్రియలతో గిన్నీస్‌బుక్‌ను అలరిస్తున్న మనుషులతో తను కూడా పోటీ పడతానంటోంది ఒక 'కప్ప'. ఆ కప్ప వయస్సు అయిదు సంవత్సరాలు. అది తినే ఆహారం ఏంటో తెలుసాండీ. ముప్పై ఎలుకలు, ప్రొటీన్‌పిండితో కలిపిన వంద పురుగులు తింటుందట. ఆ కప్ప పేరు 'ఎన్‌బాసో'. దాని పొడవు తొమ్మిదింపావు అంగుళాలట. ఇంకొక అర అంగుళం పెరిగితే



గిన్నీస్ బుక్కులోకి దూరిపోతుంది. దీనిని ఎంతో అపురూపంగా పెంచుతున్నాడు 'జెక్కోబి' అనే వ్యక్తి.

— శర్మాజీ